# కంటైనరు, బస్సు ఢీ!

ప్రమాదంలో 32 మందికి గాయాలు

తీవ్రంగా గాయపడిన వారిని తిరుపతికి తరలింపు

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, డీఎస్పీ



ప్రమాదం జరిగిన ప్రాంతంలో గుమిగూడిన జనం



క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది



తీవ్రంగా గాయపడిన డ్రైవరు రామకృష్ణ



కండక్టరు ఏబీ సురేష్



గాయపడిన ప్రయాణికురాలు పద్మజ

**మదనపల్లె నేరవార్తలు, పట్టణం, కురబలకోట, న్యూస్‌టుడే :** సిమెంటు కంటైనరు, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో బస్సులోని 32 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడిన ఘటన కురబలకోట మండలంలో మంగళవారం జరిగింది. గాలివీడు నుంచి గుర్రంకొండ మీదుగా మదనపల్లెకు వస్తున్న ఆర్టీసీ బస్సు కురబలకోట మండలం సర్కారుతోపు వద్దకు వచ్చే సరికి మదనపల్లె నుంచి కదిరి వైపు వెళ్తున్న సిమెంటు కంటైనరు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బస్సు డ్రైవరు, కండక్టరుతోపాటు 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 వాహనాలు, ఆటోల్లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవరు రామకృష్ణ, కండక్టర్ ఏబీ సురేష్, వెంకట సుబ్బయ్య, పద్మజ, గిరిబాబులను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. గాయ పడినవారిలో ఇంటర్మీడియట్ విద్యార్థులు, మదనపల్లెలో జరుగుతున్న వారపు సంతకు వచ్చే వారు ఎక్కువగా ఉన్నారు. మదన పల్లె-అంగళ్లు మార్గంలో రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో సర్కారు తోపు వద్ద ఒక మార్గాన్ని మూసేసి ఒకే మార్గంలో వాహనాల రాకపోకలకు అనుమతివ్వడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో బస్సు వెనుక వస్తున్న ద్విచక్ర వాహనం బస్సు కిందకు దూరిపోవడంతో రెడ్డివారి పల్లెకు చెందిన చోదకుడు వెంకటసుబ్బయ్య తీవ్రంగా గాయపడగా, ఈయన వెనుక వస్తున్న లగేజీ వాహనం కూడా ప్రమాదానికి గురవ్వడంతో వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ముదివేడు ఎస్.ఐ. దిలీప్‌కుమార్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని రహదారికి అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. లారీ డ్రైవరు సలీంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్.ఐ. తెలిపారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ కొండయ్యనాయుడు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఏ ఒక్కరి ప్రాణాలకు ప్రమాదం లేకుండా మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు.

## పింఛనుదారుల్లో ఆనందమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి మండిపల్లి

**రాయచోటి, న్యూస్‌టుడే:** పింఛనుదారుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని మార్కెట్ వీధిలో మంగళవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం రాయచోటిలోని శ్రీభద్రకాళీ సమేత వీర భద్రస్వామిని మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి నియామకం త్వరలో జరుగుతుందని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేవిధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఆయన వెంట కమిషనర్ వాసుబాబు, దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, ఈవో వెంకటరమణారెడ్డి, అధికారులు, నాయకులు తదితరులున్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పక్కన నాయకులు

**వైకాపాతో అంటకాగిన అధికారులు బదిలీపై వెళ్లడానికి ఇష్టపడటం లేదు. తాము పనిచేస్తున్న చోటే తిష్ట వేసుకుని కూర్చోవాలని ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నారు. కూటమి నేతలను మచ్చిక చేసుకుని తిరిగి కొనసాగేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. వీరి పనితీరుపై ఆగ్రహంతో ఉన్న కూటమి నేతలు రగిలిపోతున్నారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చినా బదిలీల పరంగా ఆశించినంతగా మార్పు రాలేదని ప్రజల్లోనూ చర్చ సాగుతోంది. ప్రత్యేకించి పంచాయతీరాజ్‌శాఖలో బదిలీలకు పారదర్శకంగా చర్యలు చేపట్టినా అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లో అమలు కావడంలేదు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించినా ఇక్కడ ఇతర జిల్లాల కంటే భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి.**



# నాడు వైకాపాతో అంటకాగి... నేడు బదిలీలపై నానా యాగి!

- ఈనాడు, కడప

ప్రజారోగ్య శాఖలో కీలక ఇంజినీర్ల వైఖరి

వివిధ ప్రభుత్వ శాఖల్లోనూ ఇదే పరిస్థితి

కడప ప్రజారోగ్యశాఖలో ఉమ్మడి కడప జిల్లా ఈఈగా గత ఎనిమిదేళ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్న ఓ అధికారి తాజాగా ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో చేరేందుకు ఎటువంటి ఆసక్తి చూపని అధికారిని బదిలీ చేసి ఆయన రాకుండా ఉండేలా ఎత్తుగడ వేశారు. దీంతో కడపలోనూ సదరు ఈఈ డిప్యుటేషన్‌పై పనిచేసేవిధంగా ముందస్తు పన్నాగం పన్నారు. అవసరమైతే కడప నగరపాలక సంస్థ ఎస్ఈగానూ నియమితులయ్యేందుకు ఎత్తులు సైతం వేస్తున్నారు. వైకాపా కీలక నేతలతో బంధుత్వం, ఆపై సొంత జిల్లా కావడం, వైకాపా నేతలతో అంటకాగడం ద్వారా ఉమ్మడి కడప జిల్లాలో చక్రం తిప్పుతున్నారు. ఇదే విభాగంలో ఏఈగా కొలువులో చేరిన ఓ ఇంజినీరింగ్ అధికారిణి దీర్ఘకాలికంగా కడపలోనే విధులు నిర్వహిస్తూ ఇటీవల డీఈఈగానూ ఉద్యోగోన్నతి పొందారు. తాజా బదిలీల్లో సదరు అధికారిణి ప్రొద్దుటూరుకు బదిలీపై వెళ్లారు. ఈమె సైతం కడపలో డీఈఈ పోస్టు ఖాళీగా ఉంచి డిప్యుటేషన్‌పై రావడానికి అన్నిరకాలుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు.

● జిల్లాపరిషత్తు కార్యాలయంలో ఇటీవల పలువురు అధికారులు బదిలీ అయ్యారు. వీరిలోనూ దాదాపు అందరూ అక్కడ నుంచి రిలీవ్ కావడానికి ఇష్టపడడంలేదు. బదిలీ ఆపుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అనంతపురం నుంచి రావాల్సిన అధికారిణి ఇక్కడకు రాకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అర్హత లేకున్నా గత వైకాపా ప్రభుత్వ హయాంలో పలువురు కీలక పోస్టుల్లో అందలమెక్కారు. పంచాయతీరాజ్‌శాఖకు చెందిన ఓ అధికారి దీర్ఘకాలంగా పనిచేస్తున్నా జిల్లా దాటి వెళ్లడానికి సుముఖంగా లేరు. జిల్లా ఉన్నతాధికారి చెప్పారంటూ రిలీవ్ కాకుండా ఇక్కడే తిష్ఠ వేసుకున్నారు. ఇదే శాఖలో అన్నమయ్య జిల్లాలో ఓ కీలక అధికారిణికి ఓ మాజీ మంత్రికి కీలక అనుచరురాలిగా ముద్ర ఉంది. కుటుంబసభ్యులు సైతం వైకాపాలో కీలకంగా ఉన్నారు. ఈమె బదిలీ నుంచి తప్పించుకున్నారు.

● రాష్ట్రంలో ఎక్కడా జరగనంతగా బద్వేలు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగాయి. ఇక్కడ మండల స్థాయి రెవెన్యూ అధికారుల హస్తంతోనే భూదందాలు సాగాయి. చాలా మంది సిబ్బంది నియోజకవర్గ స్థాయిలోనే పైరవీలతో బదిలీ చేయించుకున్నారు. అక్రమాల్లో ఆరితేరిన సిబ్బంది పక్క మండలాల్లోకి ప్రవేశించారు. అభియోగాలున్న సిబ్బందిని నియోజకవర్గాన్ని దాటించే ప్రయత్నం చేయలేదు. వీఆర్వోలైతే చాలామంది అక్కడే తిష్ఠ వేసుకున్నారు. ఇదే పరిస్థితి తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ నెలకొంది. పులివెందుల పురపాలక సంఘంలో చక్రం తిప్పిన ఓ కీలక అధికారి బద్వేలుకు బదిలీపై రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. పులివెందుల జగనన్న కాలనీల్లో అక్రమాలకు ఆద్యుడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారికి బద్వేలులో కీలక పోస్టు లభించింది. రహదారులు, భవనాల శాఖలో జరిగిన బదిలీలపైనా అంతా విస్తుపోతున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే వైకాపాతో అంటకాగిన, అక్రమాలకు పాల్పడిన అధికారుల భరతం పడతారనే అభిప్రాయం ఉండగా, చాలా మంది వివిధ మార్గాల్లో తప్పించుకుని జిల్లాలోనే తిష్ఠ వేయడంపై సర్వత్రా విస్తృత చర్చ సాగుతోంది.

## స్వచ్ఛతా హీ సేవలో జిల్లాకు పురస్కారం

**రాయచోటి, న్యూస్‌టుడే:** స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ విభాగంలో సఫాయిమిత్ర సురక్ష కాంపోనెంట్‌లో జిల్లాకు పురస్కారం వచ్చినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మచిలీ పట్నంలో ఈ నెల 2వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి చేతులమీదుగా డీపీవో ధనలక్ష్మీ పురస్కారం అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఉత్తమ సేవలందించిన జేసీ, జిల్లా పంచాయతీ అధికారులు, సీపీవో, కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సఫాయిమిత్రలు, ఆరోగ్యశాఖ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## పింఛన్ల పంపిణీలో ప్రథమం

**ఒంటిమిట్ట, చిన్నమండెం, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం కింద పేదలకు సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ చేయడంలో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో 2,20,864 మందికి పింఛన్లు మంజూరు చేయగా, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు 2,17,405 (98.43 శాతం) మంది పింఛను దారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

## పకడ్బందీగా ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

**రాయచోటి, న్యూస్‌టుడే:** ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్ హాజరయ్యారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు పక్కాగా అమలు చేయాలన్నారు. కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన వివరాలను వివరించారు. ఇంకా పరిశీలించాల్సిన భూముల వివరాలను తెలియజేశారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు పాల్గొన్నారు.

## జనసేన వీర మహిళల దీపారాధన

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే :** తిరుమల లడ్డూను అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా మదనపల్లె పట్టణంలో ఆరోరోజైన మంగళవారం జనసేన పార్టీ వీర మహిళలు నిరసన కార్యక్రమం కొనసాగించారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో పార్టీ రాయలసీమ ప్రాంతీయ సమన్వయకర్త దారం అనిత ఆధ్వర్యంలో మహిళలు దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారంతా ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వీర మహిళలు మల్లిక, రూప, అలేఖ్య, వాణి, స్వరూప, నాగమణి, రెడ్డెమ్మ, లక్ష్మి, భారతి, స్వప్న, నాయకులు హరిప్రసాద్, చంద్రశేఖర్, అశోక్, ధరణి, శ్రీనాథ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి దీక్ష చేస్తున్న వీర మహిళలు

## కోత, కుట్టు లేకుండా శస్త్రచికిత్సలు

### మదనపల్లె జిల్లా ఆసుపత్రికి రూ.96 లక్షల విలువైన యంత్రాలు

**మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే:** మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రికి రూ. 96 లక్షల విలువైన ఆధునిక యంత్రాలు వచ్చినట్లు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన ల్యాప్రోస్కోపి, హిస్టరోస్కోపి యంత్రాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, కడుపులో సమస్యలున్నవారికి కోత, కుట్టు లేకుండా శస్త్రచికిత్సలు చేయవచ్చునన్నారు. ఇకపై రోగులకు అన్ని పరీక్షలు ఇక్కడే చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఈ నెల 2న వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆప్కాస్ సిబ్బందికి తమకు వేతనాలు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. ఏడాదిగా జీతాలు రాకుంటే సిబ్బంది ఎలా జీవిస్తారని ఆసుపత్రి అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇటీవల వైద్య కళాశాల, వైద్యశాలకు వచ్చిన జీడీఏలకు సైతం వేతనాలు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి, ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ ప్రసాద్ రాజు, ఇన్‌ఛార్జి జనరల్ సర్జన్ ప్రేమ్‌నాథ్, సీనియర్ సర్జన్ డాక్టర్ సయ్యద్ సుక్రూర్, వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో ల్యాప్రోస్కోపి, హిస్టరోస్కోపి యంత్రాలను ప్రారంభిస్తున్న మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

## ఇసుక కొరత తీర్చకుంటే వలసలే దిక్కు



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** ఇసుక కొరత తీర్చాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు రాజు, శంకర్‌బాషా మాట్లాడుతూ ఇసుక కొరత తీర్చకుంటే కార్మికులకు వలసలే దిక్కని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మేస్త్రీలు, పెయింటర్లు, విద్యుత్తు పనివారు, ప్లంబింగ్, శానిటరీ, గ్రానైట్ ఇతర కార్మికులు 1,200 మంది వరకు ఉన్నారని, గత మూడు నెలలుగా ఇసుక కొరతతో ఉపాధి కరవైందన్నారు. ఇసుక కావాలంటే 120 కిలోమీటర్ల దూరంలోని రాజంపేట రేవు నుంచి తెచ్చుకోవాల్సిందేనని, రాజంపేట నుంచి ములకలచెరువుకు ఇసుక తీసుకురావాలంటే బాడుగతో కలిపి టిప్పరుకు రూ.30 వేలు ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక కొరత తీర్చకుంటే కార్మికులు ఆత్మహత్య చేసుకునే దయనీయ పరిస్థితులున్నాయని, అధికారులు స్పందించి వంక, వాగు, ఏరుల్లో ఇసుక తవ్వుకునేందుకు అనుమతులివ్వాలని కోరారు. అనంతరం వేర్వేరుగా తెదేపా నేత జయచంద్రారెడ్డి, తహసీల్దార్ ప్రదీప్‌లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రాజు, శ్రీనివాసులు, కుమార్, వెంకటేష్, గౌతమ్, రాకేష్ కార్మికులు పాల్గొన్నారు.

# బాలబడులకు మహర్దశ!

### అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

- న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం, సుండుపల్లి

గత అయిదేళ్ల వైకాపా పాలనలో బాలబడుల నిర్వహణను గాలికొదిలేశారు. మాతాశిశు సంరక్షణలో కీలకమైన అంగన్‌వాడీ కేంద్రాల బాగోగులను అప్పటి సీఎం జగన్ విస్మరించారు. తమ హక్కుల సాధనకు కార్యకర్తలు, సహాయకులు సంయుక్తంగా సమ్మెబాట పట్టారు. ఉక్కు పిడికిలి బిగించి ఉద్యమించినా జగన్ ఏలుబడిలో న్యాయం జరగలేదు. తాగేందుకు గుక్కెడు నీరు కల్పించలేదు. మరుగు వసతి మాటను మరిచారు. సౌకర్యాల కల్పనపై అంతులేని నిర్లక్ష్యం చేశారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి రోజులొచ్చాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన పనులకు అనుమతిచ్చారు.

● జిల్లాలో మహిళా, శిశు సంక్షేమశాఖ పర్యవేక్షణలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 1,858 చిన్నవి (మినీ) 417 చోట్ల సేవలందిస్తున్నాయి. వీటిల్లో సొంత భవనాలున్నవి 1,030, అద్దె గదుల్లో ఉన్నవి 795, బాడుగ మినహాయింపులున్నవి 450 ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో సొంత గూడు ఉన్న చోట రక్షిత జలాలు, మరుగు వసతిని అందుబాటులోకి తీసుకురావాలని ఇటీవల ఎన్డీయే పాలకులు నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన పనులు చేయించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. తాగునీటి పనులు చేయడానికి ఒక్కొక్క కేంద్రానికి రూ.17 వేలు వంతున కేటాయించారు. జిల్లాలోని పల్లెల్లో 483 పనులు చేయాలని గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ మదనపల్లె, రాజంపేట డివిజన్ సాంకేతిక నిపుణులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. పనులు చేయడానికి రూ.82.11 లక్షలకు అనుమతిచ్చారు. మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు ఖర్చవుతుందని అంచనా వేసి ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో 420 చోట్ల చేపట్టాలని ఉత్తర్వులిచ్చారు. వీటి నిర్మాణానికి రూ.151.20 లక్షలు ఇవ్వడానికి జిల్లా అధికారులు ఆమోదం తెలిపారు.



సుండుపల్లి మండలం కమ్మపల్లి అంగన్‌వాడీ కేంద్రం

### శరవేగంగా పూర్తి చేయిస్తాం

జిల్లాలో సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతిచ్చాం. క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేసి, పనులు చేస్తున్న అధికారులతో సమన్వయం చేసుకుని శరవేగంగా చేయించడానికి చర్యలు తీసుకుంటాం.

**- రమాదేవి, జిల్లా అధికారి, ఐసీడీఎస్, అన్నమయ్య జిల్లా**

## మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

**రాయచోటి, న్యూస్‌టుడే:** జిల్లాలో నూతన మద్యం విధానం-2024 అమలుకు ఈ నెల 1వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 111 మద్యం దుకాణాలకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. జనాభా ప్రాతిపదికన లైసెన్సు రుసుం నిర్ణయించనున్నట్లు వివరించారు. దరఖాస్తుతోపాటు రూ.2 లక్షల రుసుంను చెల్లించాల్సి ఉంటుందని, దీనిని తిరిగి దరఖాస్తుదారునికి వెనక్కి ఇవ్వబడదని తెలిపారు. ఏటా 10 శాతం రుసుం పెంచనున్నట్లు పేర్కొన్నారు. రాయచోటి, రాజంపేట, మదనపల్లె, పీలేరు పురపాలక సంఘాల పరిధిలో ఒక్కో దుకాణానికి రూ.65 లక్షల చొప్పున ఏడాదికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 11న టెండర్లు తెరుస్తామని, టెండరు దక్కించుకున్నవారు వెంటనే ఆరోవంతు మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, పక్కన జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారి మధుసూదన్

## విభజన హామీలు అమలు చేయాల్సిందే

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ కడప కలెక్టరేట్ ఎదుట మంగళవారం రాజకీయ పార్టీలతోపాటు ప్రజా, యువజన, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. కడప నగరంలోని అంబేడ్కర్ కూడలి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఐకాస కన్వీనర్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సత్తార్, బీఎస్పీ నేత గుర్రప్ప, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్, ఆర్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు తదితరులు మాట్లాడుతూ కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, కడప-బెంగళూరు రైల్వేలైను పనులను పూర్తి చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ ప్రసాద్, కృష్ణ, దస్తగిరి, మైనుద్దీన్, రాజేంద్ర, నాగేంద్ర, గోపి, నరసింహ, భాస్కర్ పాల్గొన్నారు.

# అవసరం ఎక్కువ... పంపిణీ తక్కువ!

### రబీలో ఉలవల పంట సాగుకు రైతుల ఆసక్తి

### అదనపు కోటాకు వ్యవసాయశాఖ ప్రతిపాదనలు

- న్యూస్‌టుడే, చిన్నమండెం, రాయచోటి



కేశాపురం వద్ద బీడుగా ఉన్న భూములు

ఖరీఫ్ పంటల సాగుపై వర్షాభావం తీవ్ర ప్రభావం చూపింది. జిల్లాలో ఇప్పటికే వర్షాధార పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. వేరుసెనగ పంట 40 శాతంలోపే సాగైనా కాయ దశలో వర్షాభావంతో పంట నిలువునా ఎండిపోయింది. రబీలో ప్రత్యామ్నాయ పంటగా ఉలవ సాగు చేసుకోవాలని రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారు. అందుకనుగుణంగా ప్రభుత్వం 80 శాతం రాయితీపై ఉలవలు పంపిణీ చేస్తోంది. ఒక్కో రైతుకు కేవలం పది కిలోలు మాత్రమే వ్యవసాయశాఖ పంపిణీ చేసింది. అవి కేవలం ఎకరాకు సరిపోతాయని కర్షకులు వాపోతున్నారు. రబీలో వర్షాభావాన్ని తట్టుకునే గుణం గల ఉలవలను ప్రభుత్వం జిల్లాకు 9,425 క్వింటాలు మంజూరు చేసింది. జిల్లాలోని 23 మండలాల్లోని రైతులకు ఇప్పటికే 8,511 క్వింటాళ్లు పంపిణీ పూర్తి చేశారు. అయినప్పటికీ రైతులు అదనంగా కావాలని కోరుతుండడంతో కొరత నెలకొంది. మరో ఆరు వేల క్వింటాళ్ల ఉలవలు అవసరమవుతాయని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈవిషయమై జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ జిల్లా రైతులకు ముందస్తుగా రాయితీపై ఉలవలు పంపిణీ చేశామన్నారు. మరో ఆరు వేల క్వింటాళ్ల వరకు విత్తనాలు అవసరమవుతాయని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రెండో విడతలో సాగు చేసే రైతులందరికీ పంపిణీ చేస్తామన్నారు.

| మండలం | పంపిణీ చేసింది (క్వింటాళ్లలో) | అదనపు కోటా ప్రతిపాదనలు |
| --- | --- | --- |
| రాయచోటి | 219 | 280 |
| సంబేపల్లె | 472 | 350 |
| చిన్నమండెం | 166 | 250 |
| రామాపురం | 248 | 500 |
| గాలివీడు | 360 | 500 |
| లక్కిరెడ్డిపల్లె | 445 | 500 |


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి




ప్రకటనల కొరకు సంప్రదించండి : కడప 99899 97626 మదనపల్లి 80080 01768

## క్రీడలతో మానసికోల్లాసం

**సంబేపల్లె(రాయచోటి), న్యూస్‌టుడే:** క్రీడలతో విద్యార్థులలో మానసికోల్లాసం కలుగుతుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రోజూ అర గంటపాటు విద్యార్థులకు ఆటలు ఆడించాలన్నారు. క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలలో ప్రతిభ చూపిన వారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. సంబేపల్లె వాసి ఎన్‌ఆర్‌ఐ భూమిరెడ్డి శశిధర్ రూ.లక్ష విలువైన క్రీడా పరికరాలను మంత్రి చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ధ్రువ పత్రాలు అందజేశారు. హెచ్‌ఎం ఎం.నరసింహారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.నరసారెడ్డి, మాజీ సర్పంచి నాగేశ్వరనాయుడు, శశిధర్‌రెడ్డి, గోపాల్, ఓబీసీ నాయకుడు రేవన సిద్ధప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

# సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిలిపివేత!

**గతంలో ఉమ్మడి కడప జిల్లాలో 175 చోట్ల అనుమతి**

**గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు**

**-న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం**

ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వికేంద్రీకరణను సులభతరం చేస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. 'అవినీతి లేకుండా పారదర్శకంగా అమలు చేస్తాం. సొంత ఊళ్లోనే స్థిరాస్తి అమ్మకాలు, కొనుగోలు చేసుకునేవిధంగా వెసులుబాటు కల్పిస్తున్నాం. దేశంలో ఆదర్శ వ్యవస్థకు శ్రీకారం చుట్టాం' అని అప్పటి సీఎం జగన్ డప్పు కొట్టారు. క్షేత్రస్థాయిలోని ఇబ్బందులను గాలికొదిలేశారు. వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేయాలని అనుమతిచ్చారు. ఇందు కోసం సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఆచరణలో చూస్తే చతికిలపడ్డారు. దీనిని ఎన్డీయే ప్రభుత్వం రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

★ గత వైకాపా పాలనలో ఉమ్మడి కడప జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలను 645 చోట్ల ఏర్పాటు చేయాలని ముందుకొచ్చారు. అప్పటి ప్రభుత్వ 2019, జులై 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత అదే ఏడాది అక్టోబరు 2 నుంచి నూతన పాలనకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత పౌర సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించింది. వందేళ్ల తర్వాత భూములను రీ సర్వే చేయాలని కీలకమైన నిర్ణయం తీసుకుంది. వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో అధునాతన డ్రోన్లు, ఇతర పరికరాల ద్వారా భూముల కొలతలు తీయాలని ఆదేశాలిచ్చింది. రీ సర్వే పూర్తయిన గ్రామాల పరిధిలోని సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేయించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలందాయి. సర్వే తర్వాత భూముల విస్తీర్ణంలో తేడాలొచ్చాయి. ఇది మరింత భూ వివాదాలకు కారణమవ్వడమే కాకుండా కొత్త చిక్కులు తీసుకొచ్చింది.

★ క్షేత్రస్థాయిలో 2022, జనవరి 18 నుంచి రిజిస్ట్రేషన్లు చేయించాలని ప్రణాళికను రూపొందించారు. ఉమ్మడి కడప జిల్లాలో 175 సచివాయాలను ఎంపిక చేశారు. ఈ ప్రక్రియ వేగవంతం చేయడానికి 194 రెవెన్యూ గ్రామాలను అనుసంధానం చేయించారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇచ్చారు. రీ సర్వే పూర్తయినా ప్రాంతాల్లోని సచివాలయాల్లో భూముల లావాదేవీలపై పెద్దగా రిజిస్ట్రేషన్లు జరగలేదు. గత ప్రభుత్వం ఆశించిన దాంట్లో కనీసం పదో వంతు కూడా ముందుకు సాగలేదు. మరోవైపు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంలో ఏక కాలంలో చెల్లింపు (ఓటీఎస్) ద్వారా నిర్దేశించిన డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు హక్కు పత్రాలు ఇచ్చారు. వీటిని ధనాగారాల్లో కూడా తనఖా పెట్టుకొని లబ్ధిదారులు రుణం పొందవచ్చునని అప్పటి సీఎం జగన్ నమ్మించారు. బ్యాంకులకు పత్రాలు తీసుకెళ్లిన పేద, బడుగు జీవులకు నిరాశే మిగిలింది. పరపతి ఇవ్వలేమని బ్యాంకర్లు చెప్పడంతో కథ అడ్డం తిరిగింది. గతంలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు నమ్మి మోసపోయారు. ఇప్పటికీ కొంతమందికి ఓటీఎస్ నగదు చెల్లించాలని హక్కు పత్రాలు కూడా ఇవ్వలేదు. తొలుత 72 గ్రామ సచివాయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయించాలని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కాకపోతే కొన్నిచోట్ల మాత్రమే ఈ విధానం అమలులోకి వచ్చింది. వైకాపా ప్రభుత్వానికి ప్రచారంపై చూపిన శ్రద్ధ అమలుపై చూపకపోవడంతో వ్యవస్థలో పెద్దగా పురోగతి లేదు. ప్రజలకు ఆశించిన స్థాయిలో ఉపయోగపడలేదు. మునుపటి విధానాన్ని అమలు చేయాలని ఎన్డీయే కూటమి ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సచివాలయాల్లో ఆస్తుల అమ్మకాలు, కొనుగోలుపై ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయరాదని రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. తమపై పని ఒత్తిడి తగ్గిపోయిందని సిబ్బంది ఊరట చెందుతున్నారు.



రిజిస్ట్రేషన్లు చేయడానికి తొలి విడతలో గతంలో ఎంపికైన పెన్నపేరూరు గ్రామ సచివాలయం

## భూదందాలో మదనపల్లెను మించింది బద్వేలు

● నియోజకవర్గంలో 30 వేల ఎకరాలు వైకాపా పెద్దల పరం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం

**బద్వేలు, గోపవరం, న్యూస్‌టుడే:** వైకాపా పాలనలో మదనపల్లెను మించి బద్వేలులో భూదందా సాగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. మంగళవారం గోపవరంలో సీపీఐ ఆధ్వర్యంలో భూ సమస్యలపై జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో భూకబ్జాలు ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున చేశారని విమర్శించారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని దివరిక సమాచారం ఉన్న స్థలాలను కూడా వదలకుండా రాయించుకుని, ఆ దస్త్రాలు వివాదాలున్న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాలను కాల్చేశారంటే ఇక ఆయన అరాచకాలు చెప్పకనే తెలుస్తున్నాయన్నారు. మదనపల్లెను మించి ఇక్కడి వైకాపా నాయకులు బద్వేలు నియోజకవర్గంలో భూదందాను సాగించారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జరిగిన భూ అక్రమాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకుపోయామన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రెవెన్యూ కార్యాలయాల్లో అంతులేని అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ స్థలాలను రాయించుకున్నారని ఆరోపించారు. ఓ వీఆర్వో పోరుమామిళ్లలో రూ.కోటి ఇల్లు, రూ.20 లక్షల విలువైన కారు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. బద్వేలు నియోజకవర్గంలోని కలసపాడు మండలం నుంచి అట్లూరు వరకు 30 వేల ఎకరాలు వైకాపా పెద్దల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, వీరశేఖర్, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, బద్వేలు పట్టణ కార్యదర్శి బాలు, ఇమ్మానియేలు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పక్కన నాయకులు ఓబులేసు, ఈశ్వరయ్య, తదితరులు

## నందలూరు రైలునిలయం పూర్వవైభవానికి వినతి

**నందలూరు, న్యూస్‌టుడే:** దశాబ్దాల పాటు ఒక వెలుగు వెలిగిన నందలూరు రైలునిలయానికి పూర్వవైభవం తేవాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జంబు సత్యనారాయణ గుంతకల్లు రైల్వే ఏడీఆర్‌ఎం సుధాకర్‌ను కోరారు. ఈ సందర్భంగా నందలూరు రైల్వే రన్నింగ్ గది తనిఖీ నిమిత్తం మంగళవారం నందలూరుకు వచ్చిన ఆయన్ను కలిసి వినతి పత్రం అందించినట్లు ఆయన చెప్పారు. రైల్వే ఆధీనంలో ఉన్న వందలాది ఎకరాల భూమిని వినియోగంలోకి తీసుకొచ్చి నందలూరు ఆభివృద్ధికి తోడ్పడాలని కోరినట్లు వివరించారు. తెదేపా నాయకులు సయ్యద్ అమీర్, మౌలా, మెహర్, తుమ్మాది శివ, దండు నాగేశ్వరరావు, నాగేంద్ర, శివనరసింహులు పాల్గొన్నారు.



ఏడీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న జంబు సూర్యనారాయణ, తెదేపా నాయకులు

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థినులు

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సంధ్య త్రోబాల్, మొదటి సంవత్సరం విద్యార్థిని నవ్యతేజ హ్యాండ్‌బాల్, రెండో సంవత్సరం విద్యార్థిని అరవింద టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఇటీవల గ్యారంపల్లె సాంఘిక సంక్షేమ కళాశాల ఆవరణలో జరిగిన అండర్-19 క్రీడా పోటీల్లో ఈ విద్యార్థినులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున విద్యార్థినులు ఆడతారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు వ్యాయామోధ్యాయుడు మురళీధర్‌రెడ్డిని ఆయన అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి, పీడీ మురళీధర్‌రెడ్డి

## డీఎస్పీపై జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే :** మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడిపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతంకుమార్ తెలిపారు. మంగళవారం సొసైటీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దళిత హక్కుల కోసం నిరసన కార్యక్రమాలు చేస్తే డీఎస్పీ నిరసనకారులపై కేసులు పెట్టారని తెలిపారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేశారని, మరో ఎమ్మెల్యే పంతం నానాజీ దళిత వైద్యుడిపై దాడి చేశారని నిరసనగా సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేశారని దీనిపై డీఎస్పీ ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. ఇదే రోజు ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ స్పీకర్లు పెట్టుకుని ధర్నా చేసినా వారిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. బీఎస్పీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అక్రమ కేసులపై హైకోర్టులో పిల్ వేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, గంగాధర్, డి.శివ, ప్రశాంత్, ప్రసాద్, మహేష్, రెడ్డెప్ప, నరసింహులు, ప్రకాష్, హరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతంకుమార్, పక్కన నాయకులు

## ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-17 హాకీ జిల్లా జట్ల ఎంపిక

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-17 బాల, బాలికల హాకీ జిల్లా జట్టును మంగళవారం సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి హాజరౌతారన్నారు. ఎంపిక కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శి నాగరాజు, క్రీడా భారతి కార్యదర్శి నరేష్‌బాబు, వ్యాయామోపాధ్యాయులు పాండ్యన్, రెడ్డి శ్రీనివాస్, పార్థసారథి, శ్రీనివాసులు, జలజ, అరుణ, ప్రసన్న, భార్గవితో పాటు వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామోపాధ్యాయులు

## దేశ ఉన్నతిని పెంచేవి క్రీడలే : ఆర్జేడీ

**రాజంపేట, న్యూస్‌టుడే:** దేశ ఉన్నతిని, ప్రతిష్ఠను పెంచేవి క్రీడలేనని ఇంటర్మీడియట్ కళాశాలల రీజనల్ డైరెక్టర్ ఎస్.రవి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మార్పు రావాలని.. క్రీడల్లో పిల్లలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఆయా కరాటే విభాగాల్లో పోటీ పడ్డారు. నువ్వా నేనా అనే రీతిలో తలపడ్డారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.రమణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆర్ఐపీఈ భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారద, టోర్నమెంట్ పరిశీలకులు విజయప్రసాద్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

## తెదేపా మద్దతుదారులపై వైకాపా నాయకుల దాడి

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** ములకలచెరువు మండలం, సోంపల్లి పంచాయతీ, అడవిచెరువు రోడ్డు సమీపంలో తెదేపా మద్దతుదారులపై వైకాపా నాయకులు దాడికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. తమపై హత్యయత్నానికి పాల్పడిన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తెదేపా మద్దతుదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 59 రకాల పనులకు రూ.1.87 కోట్లు విడుదల చేసింది. ఈ పనులకు ఇసుక కొరత ఉండడంతో సమకూర్చుకునేందుకు వెళ్లి వస్తున్న తెదేపా మద్దతుదారులు చిట్టి కృష్ణ, శివప్రసాద్, రాజు, గణేష్‌పై వైకాపా నాయకులు దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. మరణాయుధాలతో తమపై దాడికి వచ్చారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను తరిమివేశారు.

## న్యాయం జరగలేదని మహిళ ఆత్మహత్యాయత్నం

**పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే :** తమకు న్యాయం జగలేదని ఓ మహిళ పోలీసు స్టేషన్‌లోనే ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం పీలేరులో చోటు చేసుకుంది. బాధితులు, బంధువుల కథనం మేరకు వివరాలివి... పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న సుగుణమ్మ ఇంటి చుట్టూ రెండు నెలల కిందట గుర్తుతెలియని వ్యక్తులు అక్షింతలు, నిమ్మకాయలు చల్లారు. దీంతో సుగుణమ్మ కుటుంబ సభ్యులు ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకున్నారు. గత నెల 19వ తేదీన ఇదే కాలనీకి చెందిన తాటిపర్తి నాగరాజ రాత్రి వేళ్లల్లో సుగుణమ్మ ఇంటి ముందు మంత్రించిన అక్షింతలు, నిమ్మకాయలు వేసినట్లు సీసీ కెమెరాలో నమోదైంది. దీంతో సుగుణమ్మ కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించిన పోలీసులు నాగరాజపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నాగరాజ కుమార్తె (18) తనపై సుగుణమ్మ తమ్ముడు సత్యనారాయణ అత్యాచార యత్నం చేశాడని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మంగళవారం పీలేరు పోలీసు స్టేషన్‌కు విచారణకు వచ్చింది. విచారణ నిమిత్తం ఇరువురినీ పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారిస్తుండగా సుగుణమ్మ పోలీసు స్టేషన్‌లోనే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెను 24 గంటల పాటు పరిశీలనలో ఉంచారు. ఈ విషయమై సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా సుగుణమ్మ బెదిరింపు ధోరణిలో తమ్ముడు సత్యనారాయణపై కేసు నమోదు చేస్తే ఇక్కడే చచ్చిపోతానని వెంట తెచ్చుకున్న విష ద్రావకాన్ని తాగిందని వివరించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుగుణమ్మ

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బోరులారీ

**తపాలా బంట్రోతు దుర్మరణం**

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** ద్విచక్ర వాహనాన్ని బోరులారీ ఢీ కొన్న ఘటనలో తపాలా బంట్రోతు మృతి చెందిన ఘటన తంబళ్లపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులందించిన సమాచారం మేరకు వివరాలు... తంబళ్లపల్లె మండలం, గంగిరెడ్డిపల్లికు చెందిన మధుకర్ నాయుడు (42) గోపిదిన్నె పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా పరుసతోపు సచివాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో మధుకర్ నాయుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు శంకర్, గోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మధుకర్‌నాయుడు మృతితో తన ఇద్దరు కుమారులు జశ్వంత్, సందీప్ అనాథలయ్యారు. మధుకర్‌నాయుడు భార్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి లేని లోటును తీరుస్తూ మధుకర్ నాయుడు ఆలనపాలన చూసుకుంటూ చదివిస్తున్నాడు. పెద్ద కుమారుడు జశ్వంత్‌నాయుడు మదనపల్లిలో 10వ తరగతి చదువుతుండగా సందీప్ తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అనాథలైన ఇద్దరు పిల్లలను ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఫొటోగ్రాఫర్ అనుమానాస్పద మృతి

**బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీ గుట్టమీద హరిజనవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ సూర్యనారాయణ (25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. యువతితో ప్రేమ వ్యవహారం నేపథ్యంలో సోమవారం తన సొంత ఇంటిలో విషం తీసుకున్న ఫొటోగ్రాఫర్‌ను మదనపల్లె ఆసుపత్రికి తరలించేలోపుగానే మృతి చెందిన విషయం తెలిసిందే. తన కుమారుడిని యువతి కుటుంబ సభ్యులు కొట్టడంతో మనస్థాపానికి గురై మృతి చెందినట్లు మృతుడి తండ్రి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి శవపరీక్ష నివేదిక ఆధారంగా తదుపరి విచారణ కొనసాగుతుందని బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి విలేకరులకు తెలిపారు.

## వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా తప్పెట

**వైవీయూ (కడప):** యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వైవీయూ తెలుగు విభాగం ఆచార్యులు తప్పెట రామప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి మంగళవారం ఆయనకు నియామకం పత్రం అందజేశారు. ఇప్పటివరకు ఆ బాధ్యతలు నిర్వర్తించిన ఎస్.రఘునాథరెడ్డి రిలీవ్ అయి ప్రధానాచార్యులుగా కొనసాగనున్నారు. తప్పెట రామప్రసాద్‌రెడ్డికి 30 ఏళ్ల సుదీర్ఘమైన బోధనానుభవం ఉంది.

## సూర్యనారాయణది ముమ్మాటికీ హత్యే

**సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు**

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీలోని గుట్టమీద హరిజనవాడలో మరణించిన సూర్యనారాయణది ఆత్మహత్య కాదని ముమ్మాటికీ హత్యేనని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో సూర్యనారాయణ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువతిని ప్రేమిస్తున్నాడన్న కోపంతో అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు శనివారం రాత్రి సూర్యనారాయణను అడ్డగించి తీవ్రంగా కొట్టి హింసించినట్లు గ్రామస్థులు చెబుతున్నారని అన్నారు. అయితే ఆదివారం గాయాలతో బాధపడుతున్న బాధితుడు స్థానికంగా ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లి నిద్రలోనే మృత్యువాతపడ్డాడన్నారు. బాధితుడి మర్మాంగాలపై గాయాలున్నాయని దీన్ని బట్టి కొట్టడం వల్లే అతను చనిపోయాడని ఆరోపించారు. పోలీసులు దీన్ని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారన్నారు. హత్య కేసుగా నమోదు చేయకుండా అనుమానాస్పద మృతి కేసు నమోదు చేయడం దారుణమన్నారు. జిల్లా అధికారులు దీనిపై విచారణ చేసి బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

## తరిగొండలో పవిత్రోత్సవాలు

**గుర్రంకొండ, న్యూస్‌టుడే :** తరిగొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారి పవిత్రోత్సవాలు ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభమై 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. 2వ తేదీన అంకురార్పణం, 3న యాగశాలల వైదిక కార్యక్రమం, పవిత్ర ప్రతిష్ఠ, స్నపన తిరుమంజనం, యాగశాల కైంకర్యం, 4న యాగశాల వైదిక కార్యక్రమం, పవిత్రాల సమర్పణ, యాగశాల కైంకర్యాలు సమర్పణ, 5వ తేదీ మహా పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ, పవిత్రాల వితరణ, చక్రస్నానం, తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. భక్తాదులు పాల్గొని స్వామి అనుగ్రహం పొందాలన్నారు.

మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P. No. 1/2024

1) తొట్టి @ పోకల రేవతికుమారి, భర్త లేట్ శివకుమార్, హిందూ, వయస్సు 38 సం॥లు.
2) తొట్టి @ పోకల పవన్‌కళ్యాణ్ యాదవ్, తండ్రి శివకుమార్.
3) తొట్టి @ పోకల అఖిలేష్ యాదవ్, తండ్రి శివకుమార్, 2 & 3 మైనర్లు, గార్డియన్ తల్లి పిటీషనరు నెం.1, సాకిన్ డి.నెం. 1/71, అగ్రహారం, H/o కల్వనాయుని చెర్వు గ్రా. రామాపురం (మం). ... పిటీషనర్లు

V/s

1) తొట్టి శిద్ధమ్మ, భర్త లేట్ సుబ్బరాయుడు, 64 సం॥లు. 2) అడపాల నాగలక్ష్మి, భర్త వెంకట్రమణ, 37 సం॥లు, డి.నెం. 1-61-ఎ, అగ్రహారం, H/o కల్వనాయుని చెర్వు గ్రా. రామాపురం (మం). 3) ది జిల్లా కలెక్టరు, అన్నమయ్య జిల్లా, 4) ది రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా, 5) ది మండల తహశీల్దారు, రామాపురం (మం).

... రెస్పాండెంట్లు

**నోటీసు ప్రకటన**

పై నెంబరు దావాలో పిటీషనర్లు వీఆర్ఏగా పనిచేయుచున్న తొట్టి సుబ్బరాయుడు చనిపోయినందున వార్సులుగా పిటీషనర్లు అయినందున సక్సెషన్ సర్టిఫికేటు కోరుచూ S.O.P. దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనులో మీకేమైనా అక్షేపణలున్న యెడల 07.11.2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ, వకీలు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క అక్షేపణలు తెల్పుకోవలయును. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

ఇట్లు : శ్రీ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, M.Com., LL.B., శ్రీ పి.రెడ్డిబాష, B.Sc., LL.B., పిటీషనర్ల పరం అడ్వకేట్, రాయచోటి.

## అడ్డకొండ... తూర్పు రైతులకు అండ

**రామసముద్రం, న్యూస్‌టుడే:** రామసముద్రం మండలంలోని అడ్డకొండ తూర్పు ప్రాంత రైతులకు అండగా మారింది. కొండకు పరమటి భాగంలో ఉన్న గ్రామ పంచాయతీలు కర్ణాటక రాష్ట్ర సరిహద్దు భాగంలో ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రంలో టమాట తోటలకు తెగుళ్ల తీవ్రత ఎక్కువైపోయింది. ఆ గాలివీచిన కొండ పరమటి భాగంలోని టమాట తోటలకు తెగుళ్ల తీవ్రత పెరిగిపోయింది. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సగభాగం దిగుబడి కూడా రైతులకు దక్కడం లేదు. అదే కొండకు తూర్పు భాగంలో సాగు చేసిన తోటలకు ఆ గాలి వీచకుండా అడ్డుపడుతోంది. వీచిన గాలి కొండకు దూరంగా వెళ్లిపోంది. టమాట తోటలు తెగుళ్లకు గురికాకుండా ఏపుగా పెరుగుతున్నాయి. దిగుబడి రెట్టింపుగా వస్తోంది. అడ్డకొండ ఆ ప్రాంత రైతులకు అండగా మారింది.



## ఆగిన వంట... ఆకతాయిలకు పంట

కలికిరి పంచాయతీ సత్యాపురం తెలుగు, ఉర్దూ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ కోసం ఆయా పాఠశాలలకు సంబంధించి వంట గదులు నిర్మించారు. ఇందులో ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు లేకపోవడంతో ఆ పాఠశాల మూతపడింది. తెలుగు పాఠశాల మాత్రం కొనసాగుతోంది. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఇస్కాన్ సంస్థ ద్వారా సరఫరా జరుగుతోంది. దీంతో ఈ వంటగదుల నిర్వహణ లేకపోవడంతో వేలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వంట గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో పాటు పాఠశాలకు ప్రహరీ నిర్మాణం జరగకపోవడంతో వంటగదులు ఆకతాయిల చేష్టలకు నిలయాలుగా మారాయి. ఈ విషయాన్ని ఎంఈవో-2 నాగార్జున దృష్టికి తీసుకెళ్లగా. . పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.



సత్యాపురం పాఠశాలల్లో నిరుపయోగంగా గదులు

**- న్యూస్‌టుడే, కలికిరి**

## శాంతి, సోదరభావంతోనే ఐక్యత సాధ్యం

**అశోక-అంబేడ్కర్ ధమ్మ యాత్రకు ఘన స్వాగతం**

**మదనపల్లె పట్టణం, వాల్మీకిపురం, న్యూస్‌టుడే :** శాంతి, సోదరభావంతోనే భారతీయుల మధ్య ఐక్యత సాధించగలమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుద్ధిస్ట్ ఫ్రెటర్నిటీ కౌన్సిల్, నేషనల్ ధమ్మ యాత్ర కమిటీ సంయుక్తాధ్వర్యంలో కేరళ రాష్ట్రం బుద్ధభూమి నుంచి వచ్చిన అశోక-అంబేడ్కర్ ధమ్మయాత్రకు వాల్మీకిపురం, మదనపల్లెలో ఘన స్వాగతం లభించింది. ధమ్మయాత్ర కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. యాత్ర అంబేడ్కర్ కూడలి వద్దకు చేరుకోగా, బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ అనుయాయులు కూడలికి చేరుకుని బౌద్ధ భిక్షువులకు యాత్ర నిర్వాహకులకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. బౌద్ధ భిక్షువులు మౌర్యన్ బుద్ధర్, సిద్ధారక్కిత, బుద్ధశీలర్, బుద్ధిస్ట్ ఫ్రెటర్నిటీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ భారతి ప్రభు శాంతి, సోదరభావంపై వివరించారు. అనంతరం ర్యాలీ సీటీఎం రోడ్డు మీదుగా టౌన్ బ్యాంకు కూడలి, బెంగళూరు బస్టాండు, అనిబీసెంట్ కూడలి మీదుగా బెంగళూరు రోడ్డు కాలనీ గేటు వద్ద నున్న న్యూ అంబేడ్కర్ కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు యమలా సుదర్శన్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ప్రతినిధులు గణపతి, రమణ, రవి, ఎం.మోహన్, పి.తాతయ్య, కె.వి.రమణ, పి.శ్రీనివాసులు, బి.రెడ్డిప్రసాద్, చిన్నప్ప, మునివెంకటప్ప, బి.నరసింహులు, చెన్నకేశవులు పాల్గొన్నారు.



అశోక అంబేడ్కర్ ధమ్మయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

EDUCATION

డిప్లొమా కోర్సులు: DMLT - ల్యాబ్ టెక్నీషియన్, DMIT - ఇమేజింగ్ టెక్నాలజీ, DANS - అనస్థీషియా టెక్నీషియన్, DRGA - ఎక్స్‌రే టెక్నీషియన్, DOA - ఆప్తాల్మిక్ అసిస్టెంట్, DMPHA - శానిటరీ ఇన్‌స్పెక్టర్ నందు 2 సం||లు కోర్సులకు అడ్మిషన్లు కలవు. అర్హత : ఇంటర్ పాస్.ఏదైనా గ్రూప్ అర్హత గల వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కలదు. సెల్: 7416523777.

ప్రొద్దుటూరులోని పారా మెడికల్ కళాశాలలో డిప్లొమా-2 సం||ల కోర్సులకు DMST-ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, DOM-ఆప్టోమెట్రీ టెక్నీషియన్ DECG-ECG టెక్నీషియన్, DMLT-ల్యాబ్ టెక్నీషియన్ DMPHA(M) - శానిటరీ ఇన్‌స్పెక్టర్ అడ్మిషన్లు జరుగుచున్నవి. అర్హత: ఇంటర్ ఏదైనా గ్రూప్ పాస్ అర్హత గల వారికి ఫీజు రీయంబ్రస్‌మెంట్ సౌకర్యం కలదు. సంప్ర: 7396119903.

ప్రొద్దుటూరు HGN ప్లైవుడ్ నందు పనిచేయుటకు టూల్స్ మెకానిక్, అవుట్‌డోర్ సేల్స్‌మెన్స్, ఆఫీస్‌బాయ్, అకౌంటెంట్స్, ఆఫీస్ వర్క్‌కు యువతి కావలెను.సెల్: 9515089758.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం 18K. ✆ 91609 00024, 96404 00073.

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో బ్రాహ్మణ స్త్రీలు మాత్రమే బ్రాహ్మణ కుటుంబం నందు అక్కడే ఉండి వంటకు స్త్రీలు (ఇద్దరు) మరియు కేర్‌టేకర్ కావలెను. Ph: 9866252220.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి పెట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మదనపల్లె
•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

## జీవన ఎరువులతో దిగుబడులు


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

మదనపల్లె పట్టణం: పంటల సాగులో రైతులు జీవన ఎరువులు వాడాలని అప్పుడే పంట దిగుబడితో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రేగంటివారిపల్లెలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వరి, టమాట పైరులను పరిశీలించి సూక్ష్మపోషక లోపాలను సరి చేసుకోవాలని సూచించారు. ఏవో నాగప్రసాద్, ఉద్యానశాఖ అధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, పట్టుపరిశ్రమశాఖ అధికారి రసూల్, వీహెచ్ఏ సుబ్రహ్మణ్యం, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆహార దినం కాదు ఆకలిది

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు అవుతున్నా యాభై శాతం మంది ఇంకా ఆకలితోనే అలమటిస్తున్నారని ఏపీవీవీయూ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ అన్నారు. మంగళవారం కొత్తపల్లెలో ఏపీవీవీయూ సభ్యులతో కలిసి ఆకలి రోజు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 16న ప్రపంచ ఆహార దినం జరుగుతుందని వాస్తవానికి అది మనకు ఆకలి రోజుగా పరిగణించాలని డిమాండు చేశారు. ప్రజా చైతన్య యాత్రలు చేస్తున్నట్లు చెప్పారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.


కొత్తపల్లెలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీవీవీయూ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ, సభ్యులు

## మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

కంభంవారిపల్లె : మండలంలోని నూతన కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని మేమున్నాం మీకుతోడుగాలో భాగంగా కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి పంచాయతీ పారిశుద్ధ్య చర్యలు చేపట్టింది. నూతన కాలనీ బస్టాండు ప్రాంతంలో పెరిగిపోయిన కొళ్ల వ్యర్థాలను తొలగించారు.

? మండలంలోని కలిచెర్ల బైపాస్ రోడ్డు తాటిమానుపల్లెకు వెళ్లేదారిలో విద్యుత్తు నియంత్రిక తీగలు అల్లుకున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. విద్యుత్తు తీగలకు ప్రసారాన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నాయి. - రమణ, కలిచెర్ల

✔ ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చిమొక్కలు, తీగజాతి మొక్కలు విద్యుత్తు స్తంభాలను అల్లుకున్నాయి. వారం రోజుల్లో పిచ్చి మొక్కలు తొలగించి ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద జాగ్రత్తలు చేపడతాం. - ట్రాన్స్‌కో అధికారులు - న్యూస్‌టుడే, పెద్దమండ్యం

## ఇసుక వాహనాల జప్తు


స్వాధీనం చేసుకున్న వాహనాలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం ఆరోగ్యవరం వద్ద అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దారు ఖాజాబీ తెలిపారు. మంగళవారం మండలంలోని సీటీఎం గ్రామానికి క్షేత్రస్థాయిలో వెళ్లి తిరిగి వస్తున్న రెవెన్యూ అధికారులు తిరుపతి మార్గంలో వాహనాలు తనిఖీ చేశారు. అనుమతి లేకుండా ఇసుక మదనపల్లెకు తరలిస్తున్న ట్రాక్టరును, అలాగే మట్టి తరలిస్తున్న టిప్పరును స్వాధీనం చేసుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఆర్ఐ రెడ్డెప్ప, వీఆర్వోలు ఉన్నారు.

బి.కొత్తకోట: గుమ్మసముద్రం వద్ద ఉన్న వంక నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును సీజ్ చేసినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ తరలింపుపై తమకు అందిన సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నామని పేర్కొన్నారు.

రామసముద్రం: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ టిప్పరును చెంబకూరు మాదిరెడ్డి కాలనీలో మంగళవారం సాయంత్రం రామసముద్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ యజమాని గంగరాజు, డ్రైవర్ ప్రసాద్, బ్రోకర్ ప్రకాష్, మేస్త్రి వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌.ఐ. వెంకటసుబ్బయ్య తెలిపారు.

## అనారోగ్యంతో వృద్ధుడి బలవన్మరణం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ ఎర్రమ్మగారిపల్లెకు చెందిన రామిరెడ్డి (65) మంగళవారం మృతి చెందారు. కుటుంబీకుల కథనం మేరకు.. కడుపునొప్పితో బాధపడుతున్న రామిరెడ్డి ఈనెల 26న తన ఇంట్లోనే పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థత గురయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన భార్య లక్ష్మమ్మ గ్రామస్థుల సహాయంతో మదనపల్లె ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రామిరెడ్డి తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల నుంచి అందిన ఫిర్యాదుతో రామిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ రాజారెడ్డి తెలిపారు.

## ఎమ్మెల్యేలపై చర్యలకు వినతి

ములకలచెరువు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి అవమానించిన తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దళిత వైద్యుడిపై దాడి చేసి దూషించిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్, ఇన్‌ఛార్జి మల్లికార్జున అన్నారు. మంగళవారం ములకలచెరువు బీఎస్పీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళితులపై దాడులు పెచ్చుమీరుతున్నాయని వాటిని అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, రమణ, కృష్ణప్ప, అంజి, నవీన్, రవి పాల్గొన్నారు.

## సేవాగుణం అలవర్చుకోవాలి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని మదనపల్లె ఒకటో పట్టణ సీఐ రామచంద్ర అన్నారు. మంగళవారం మదనపల్లె మండలం బార్లపల్లె సమీపంలోని గోశాలకు అమ్మచెరువు మిట్టకు చెందిన రాజు స్వామి లారీ దాణ పశుగ్రాసం వితరణ అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన సీఐ మాట్లాడుతూ మూగజీవాలకు పశుగ్రాసం అందించడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరు రాజుస్వామిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోశాల నిర్వాహకుడు రాజశేఖర్ స్వామి, గిరిబాబు, గౌతమ్‌స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ గ్రామసభలు

కలికిరి: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని కలికిరి మండలంలో ఉపాధి హామీ గ్రామసభలు బుధవారం ఉదయం నిర్వహిస్తామని ఎంపీడీవో గంగయ్య తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాల్లో నిర్వహించే సభల్లో ఉపాధి హామీకి సంబంధించిన పనుల గుర్తింపు ప్రణాళికలు రూపొందించడం, పంట సంజీవని చేసే రైతుల వివరాలను సేకరిస్తామన్నారు. స్వచ్ఛతా సేవ కార్యక్రమం ముగింపు వేడుకలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## మాల మహానాడు కార్యవర్గం ఏకగ్రీవం

కలికిరి, (వాల్మీకిపురం): మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు యమల సుదర్శన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాల మహానాడు పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా చింతపర్తికి చెందిన చిరంజీవిని నియమించారు. వాల్మీకిపురం మండల అధ్యక్షుడు నాగార్జున, కార్యదర్శులు మనోజ్‌కుమార్, గౌతమ్, గౌరవాధ్యక్షులుగా బీవీ రమణ, ఉపాధ్యక్షులుగా కేదీరమణ, కోశాధికారి శ్రీనివాసులు, యూత్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్‌కుమార్ తదితర సభ్యులను ఎన్నుకున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

## హూహా... పతకాల్లో వహ్వా

కరాటేలో రాణిస్తున్న చిన్నారులు

బరిలోకి దిగితే విజయం తథ్యం

పాఠశాల స్థాయి విద్యార్థులు చదువులతో పాటు యుద్ధ విద్యల్లో కూడా రాణిస్తూ సత్తా చాటుతున్నారు. పీలేరుకు చెందిన మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు కరాటే పోటీల్లో రాణిస్తూ పతకాల పంట పండిస్తున్నారు. సంస్థ నిర్వాహకుడు కరాటే మాస్టర్ ఇనామ్ హక్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను పోటీలకు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల కర్నూలులో జరిగిన 6వ అంతర్రాష్ట్ర కరాటే పోటీల్లో బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు సాధించారు. విద్యార్థుల వివరాలివి..

- పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే

### అంతర్జాతీయ స్థాయిలో సత్తా



పీలేరుకు చెందిన ఖాదర్ వలీ కుమారుడు **రాహిల్ ఆఫ్రిది** ఆరో తరగతి చదువుతున్నాడు. ఇతను 2022లో తిరుపతిలో జరిగిన నేషనల్ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ద్వితీయ స్థానం, 2023లో పీలేరులో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం, కర్నూలులో జరిగిన ఆరవ అంతర్రాష్ట్ర పోటీల్లో ప్రథమ స్థానంతో బంగారు పతకం సాధించాడు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నాడు.

### వ్యాయామం... ఆరోగ్యం



పీలేరుకు చెందిన రామకృష్ణ కుమారుడు **రెడ్డిముదిత్ సాయి** 7వ తరగతి చదువుతున్నాడు. కరాటేపై అతనికున్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. ఇతను 2022లో తిరుపతిలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో, 2023లో కర్ణాటక రాష్ట్రంలోని గౌరీబిదనూరులో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటాడు. కరాటేతో వ్యాయామం, ఆరోగ్యం సాధ్యమవుతాయని చెప్పారు.

### విశ్వవ్యాప్త గుర్తింపు



పీలేరుకు చెందిన శ్రీనివాసులు కుమారుడు **వికాస్** యుద్ధ విద్యపై మక్కువ పెంచుకున్నాడు. తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించడంతో 2022లో తిరుపతిలో జరిగిన నేషనల్ ఓపెన్ ఛాంపియన్ షిప్, 2022లో పీలేరులో జరిగిన కరాటే ఛాంపియన్ పోటీలు, కర్ణాటక రాష్ట్రంలోని గౌరీబిదనూరులో జరిగిన నేషనల్ ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు. యుద్ధ విద్యల్లో ప్రావీణ్యం సంపాదించడం వల్ల విశ్వవ్యాప్త గుర్తింపు వస్తుందని ఆ స్థాయిలో ఎదగాలన్నదే లక్ష్యమని చెప్పారు.

### బాల్యంలోనే యుద్ధ విద్యల్లో ఆరితేరాలని...




సాధన చేస్తున్న చిన్నారులు

పీలేరుకు చెందిన మోహన్‌రెడ్డి కుమార్తె **కాన్వికారెడ్డి** నాలుగో తరగతి చదువుతోంది. బాల్యంలోనే కరాటే నేర్చుకోవాలని సంకల్పించడంతో అకాడమిలో చేర్పించారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న చిన్నారి 2022లో పీలేరులో యోధా ఇంటర్నేషనల్, 2023లో కర్ణాటక రాష్ట్రంలోని గౌరీబిదనూరులో నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్, కర్నూలులో జరిగిన 6వ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని అబ్బాయిలతో పోటీ పడి పతకాలు సాధించింది. బ్రూస్‌లీ తనకు ఆదర్శమని ఈ చిన్నారి చెబుతోంది.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం


సన్మాన గ్రహీతలతో యూత్ కరాటే క్లబ్ సభ్యులు, విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని క్రీడా భారతి జిల్లా కార్యదర్శి నరేష్, మదనపల్లె యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఆర్ సురేష్ అన్నారు. మంగళవారం మదనపల్లె యూత్ కరాటే క్లబ్ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేశారు. కరాటే విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి బెంగళూరు బస్టాండు వద్ద కార్మికులకు సన్మానం చేశారు. ప్రజలు నిద్రలేవకనే పట్టణాన్ని శుభ్రం చేసే గొప్ప మనసు పారిశుద్ధ్య కార్మికులకు మాత్రమే ఉందని వారి సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో మరసం నాయకుడు లింగాల యుగంధరాచారి, లియాకత్‌బాషా, బ్లాక్‌బెల్ట్ విద్యార్థులు మహేశ్వర్, మొహమ్మద్‌ఐమన్, మోహిబుల్‌రెహ్మాన్, కాలేషా, మస్తాన్, మహమ్మద్ ఉమ్మర్, లాస్య, తేజిత్‌తో పాటు కరాటే విద్యార్థులు, తల్లిదండ్రులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా దసరా ముందస్తు సంబరాలు

మదనపల్లె విద్య: రాముడు చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, భాజపా జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు అన్నారు. మంగళవారం విజయభారతి పాఠశాలలో ముందస్తు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా రామాయణం నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ సంస్కృతీ, సాంప్రదాయాలు ఉట్టి పడేలా పాఠశాలలో విద్యార్థులు నాటక ప్రదర్శన చేశారని వారి ప్రదర్శన జాతీయ స్థాయి అవార్డులు అందించేలా ఉందని కొనియాడారు. ఇలాంటి పాఠశాల మదనపల్లెలో ఉండటం ఇక్కడి విద్యార్థుల అదృష్టమని అన్నారు. అనంతరం రావణాసురుడి బొమ్మకు బాణం వేసి నిప్పు పెట్టారు. డాక్టర్ అజంతుల్లాఖాన్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

రామసముద్రం: మట్లవారిపల్లె ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని స్రవంతి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లె మండలం సీటీఎంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి హాకీ పోటీల్లోని బాలికల విభాగంలో అండర్-17 స్థాయిలో విద్యార్థిని రాణించినట్లు తెలిపారు. నవంబరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినిని ఎంపిక చేసినట్లు తెలిపారు. పీడీ పార్థసారధి, ఉపాధ్యాయులు అభినందించారు.

## పేదల మోములో చిరునవ్వే కూటమి ధ్యేయం


పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతతో పనిచేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని రెడ్డెప్పనాయుడుకాలనీ, ఎస్బీఐ కాలనీ కుమారపురంలతో పాటు మండలంలోని చిలకవారిపల్లె, మిట్టపల్లె, సీటీఎం-2, పోతబోలు పంచాయతీలోని తురకపల్లె, తట్టివారిపల్లె, నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ ఎద్దులవారిపల్లె, వడ్డిపల్లెల్లో గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొందరు అర్హులు పింఛన్ల కోసం అర్జీలు ఇవ్వడంతో వీటిపై విచారించి అర్హత పత్రాలతో అంతర్జాలం చేసి పింఛను మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, తహసీల్దార్ ఖాజాబీ, తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ములకలచెరువు: ప్రతి నెలా 1వ తేదీనే పింఛనుదారుల్లో చిరునవ్వు చూడడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేవళచెరువు, సోంపాళ్యం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో జయచంద్రారెడ్డి పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పట్ల ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు నాయకులు దృష్టికి లేదా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం సోంపాళ్యంలో ఎన్టీఆర్ సృజల స్రవంతి శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధికార ప్రతినిధి త్యాగరాజు, నాయకులు యర్రగుడి సురేష్, కేవీ రమణ, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు, సిద్దయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.


పింఛను అందజేస్తున్న రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ సభ్యురాలు పర్వీన్‌తాజ్, పక్కన నాయకులు


ములకలచెరువులో పింఛన్ల పంపిణీలో తెదేపా నేత జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు తెదేపా కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు పర్వీన్‌తాజ్ తెలిపారు. బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ వడిగలవాండ్లపల్లె, బుచ్చిరెడ్డిగారిపల్లెల్లో ఆమె మంగళవారం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కార్యదర్శి డి.కుమార్, స్థానిక నాయకులు రామప్ప, గోవిందు, బండి రమణ, కోదండరాం ఇందులో పాల్గొన్నారు.

## టెట్ పరీక్ష ఏర్పాట్ల పరిశీలన

అంగళ్లు (కురబలకోట): అంగళ్లు విశ్వం కళాశాలలో టెట్ పరీక్ష నిర్వహణపై ఉన్నతాధికారుల బృందం పరిశీలన జరిపిందని ఎంఈవో ద్వారకనాథ్ తెలిపారు. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు కళాశాలలో పరీక్ష జరగనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి కడప జిల్లా పరిశీలకులు, కేజీబీవీ కార్యదర్శి మధుసూదన్‌రావు కళాశాలకు మంగళవారం విచ్చేసి ఏర్పాట్లను పరిశీలించారు. కస్తూర్బా గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాలలో విద్యా సామర్థ్యాలను పెంచుకోవాలని, కనీస సౌకర్యాలను కల్పించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ధనలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో టెట్ డీవోలు ఎంఈవోలు రెడ్డిశేఖర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం

కలికిరి, (వాల్మీకిపురం) న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాల్మీకిపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీలలో విజేతలైన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ షీల్డు, ప్రశంసా పత్రాలు, పతకాలను మంగళవారం అందజేశారు. మండల స్థాయి పోటీల్లో ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు సాయిలీల, చరిష్మా, ఉగ్రాభాను మొదటి స్థానం, రెండో స్థానంలో చింతపర్తి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నంద కిశోర్, భాను, లాలస నిలిచారన్నారు. వీరు ఈ నెల 27న రాయచోటిలో జరిగే జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సువర్ణ, కిశోర్, నాగరాజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వయో వృద్ధులు... స్ఫూర్తిదాతలు



వృద్ధులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : అమ్మచెరువుమిట్టలోని వెలుగు వృద్ధాశ్రమంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వయో వృద్ధులను ఘనంగా సన్మానించారు. వారికి అందిస్తున్న సేవలను కొనియాడి ఆచార్య శ్రీనివాసులు, విశ్రాంత జిల్లా పరిపాలనాధికారి కె.ధనలక్ష్మి, మదనపల్లె ట్రాఫిక్ ఏఎస్ఐ చంద్రయ్య రూ.5 వేలు చొప్పున విరాళం అందజేశారు. వెలుగు వృద్ధాశ్రమం కార్యదర్శి ఉదయ్‌మోహన్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, బీటీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ వై.ఎస్.మునిరత్నం, డాక్టర్ రాజేంద్రకుమార్, లీనాకుమారి, గీత తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు ఆనంద్ మాట్లాడుతూ నిరాశ్రయులైన పిల్లలతో పాటు వృద్ధుల కోసం 2009లో చైతన్య సంస్థను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 79 మంది వృద్ధులను చేరదీసి వారికి అన్ని సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. వీరిలో కొందరు మృతి చెందగా వారికి అంత్యక్రియలు కూడా చేసినట్లు తెలిపారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు టువాళ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కవితారాణి, కోశాధికారి గిరిజమ్మాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు

## దాడి కేసుపై డీఎస్పీ విచారణ!

### బాధితుడికి న్యాయం చేస్తామని హామీ



ఘటనపై సీఐ, ఎస్.ఐ.లతో చర్చిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రంలోని బలిజవీధికి చెందిన రైతు ఆదినారాయణరెడ్డిపై జరిగిన దాడి కేసుపై మంగళవారం మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు విచారణ చేపట్టారు. కేసు వివరాలపై సీఐ రమేష్, ఎస్.ఐ. వెంకట సుబ్బయ్యలతో చర్చించారు. అనంతరం బాధితుని నుంచి వివరాలు సేకరించారు. కేసు వివరాల మేరకు... గత శనివారం రాత్రి ఆదినారాయణరెడ్డి పొలం పక్కనున్న తోటలో టమాటాలు చోరీకి గురయ్యాయి. రామసముద్రంలోని దిగువ దళితవాడకు చెందిన గోవిందు చోరీకి పాల్పడినట్లు ఆదినారాయణరెడ్డి సంబంధిత తోట యజమానికి చెప్పారు. దీంతో ఆగ్రహించిన గోవిందు తన అనుచరులతో కలిసి ఆదినారాయణరెడ్డి ఇంటిపై గత ఆదివారం దాడి చేసి తీవ్రంగా కొట్టారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గోవిందు, నారాయణస్వామి, బాలాజీ, రమేష్, వాసుతో పాటు మరికొంతమందిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడికి మద్దతుగా రామసముద్రంలో సోమవారం దుకాణదారులు, మద్దతుదారులు బంద్ పాటించి స్వచ్ఛందంగా దుకాణాలు మూసేశారు. ఆదినారాయణరెడ్డిపై దాడి చేసినవారిని అరెస్టు చేయాలని వారంతా డిమాండు చేశారు. పట్టణంలో అల్లరిమూలకపై నిఘా ఉంచాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. దీంతో పోలీసులు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఐ, ఎస్.ఐ.లను డీఎస్పీ ఆదేశించారు.

## ఘనంగా అనిబిసెంట్ జయంతి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : అనిబిసెంట్ జయంతి వేడుకలను స్థానిక బీటీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ... ఐర్లాండ్‌లో జన్మించి రాయలసీమలో విద్యాభివృద్ధికి కృషి చేసిన డాక్టర్ అనిబిసెంట్ అందరికీ మార్గదర్శి అయ్యారన్నారు. ఆమె చేసిన కృషి ఫలితమే వేల మంది విద్యార్థులు చదువుకునేందుకు కళాశాల ఏర్పాటు విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఆమెను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి కేంద్రం వైద్యుడు భార్గవ్ ఆధ్వర్యంలో జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 30 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. డాక్టర్ రాఘవరెడ్డి, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ శైలజ, ఎన్‌సీసీ కేర్‌టేకర్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీదేవి, అధ్యాపకులు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలికిరి గ్రామీణ: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎల్లమ్మ ఆలయం వద్ద కలికిరి సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు యువకులు స్వచ్ఛందంగా 40 యూనిట్ల రక్తందానం చేశారు. ట్రస్టు నిర్వాహకులు రెడ్డివారి అశోక్ కుమార్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, రియాజ్, ఇనాయతుల్లా, డాక్టర్లు లోకవర్ధన్, శివప్రసాద్, బ్లడ్‌బ్యాంకు సభ్యులు పాల్గొన్నారు.

కలికిరి, (వాల్మీకిపురం): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్.ఐ. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వైద్యురాలు డాక్టర్ ఫైరోజా బేగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 37 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచి రాజేంద్రాచారీ, నాయకులు వల్లిగట్ల వెంకటరమణ, పీవీ నారాయణ, కోసూరి చంద్ర, యూసూఫ్, గాంధీపేట రమణ, బొక్కసంబ్రదర్స్, పోలీస్ సిబ్బంది, డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




(c) eenadu

# రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

## వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధుల దూరం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కొండయ్య

**రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే:** వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు రాకుండా చూసుకోవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య తెలిపారు. స్థానిక నారాయణ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యాధులు, నివారణ మార్గాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వైద్యసిబ్బంది పాఠశాలలోని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డీపీఎంవో రియాజ్‌బేగ్, పాఠశాల ఏజీఎం శంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఖాదర్‌వలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

**ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే:** రైతులు సాంకేతిక, నూతన పద్ధతులు అవలంబిస్తే సత్ఫలితాలు వస్తాయని ఏవో మల్లిక అన్నారు. చిన్నఓరంపాడు పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అంతర్ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


అంతర్ పంట సాగుపై రైతులకు వివరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి మల్లిక

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM to 1 PM)
రాజంపేట: 9441872651
రాయచోటి: 9703622242
రైల్వేకోడూరు: 7981695235

**?:** పురపాలక పరిధిలోని రాజా, లక్ష్మీపురం ప్రాంతం, కొత్తపల్లె తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు లేక మురుగు మొత్తం రోడ్లపై పారుతోంది. కాలువలు నిర్మించాలి.
- మన్సూర్ అలీఖాన్, ఆడిటర్, రాయచోటి

**✓:** మురుగు కాలువలు లేని ప్రాంతాల్లో కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే కాలువలు నిర్మిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
- వాసుబాబు, కమిషనర్ - న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

## అంజన్నకు ప్రత్యేక పూజలు

**పుల్లంపేట, న్యూస్‌టుడే:** స్థానిక బజారువీధిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, ప్రత్యేక పూజలు చేపట్టారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## సౌమ్యనాథస్వామి హుండీ లెక్కింపు

**నందలూరు, న్యూస్‌టుడే:** మండలంలో వెలసిన శ్రీసౌమ్యనాథస్వామి ఆలయంలో సోమవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ ఆధ్వర్యంలో తితిదే అధికారులు స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆయన మాట్లాడుతూ నెలలో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.1,73,175 వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని ఆలయానికి చెందిన బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు వివరించారు.

## 5న రైతులతో సమావేశం

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** ఈ నెల 5న రైల్వేకోడూరులో ఉద్యాన రైతులతో జేసీ రాజేంద్రన్ మార్కెటింగ్ శాఖ అధికారులు సమావేశం నిర్వహిస్తారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బొప్పాయి, మామిడి, అరటి ధరలపై దళారులు, వ్యాపారులు చేస్తున్న మోసాలను అరికట్టాలంటూ తాము జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి.. రైతులతో నేరుగా మాట్లాడాలని అధికారులకు సూచించినట్లు వివరించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి వారు చర్యలు చేపడతారని తెలియజేశారు.

## విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు ప్రతిభ పరీక్షలు

**రాజంపేట, న్యూస్‌టుడే:** ప్రతి విద్యార్థి విజ్ఞానంతో కూడిన పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని.. తద్వారా ఆలోచన శక్తి పెరుగుతుందని జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ నందకిశోర్‌గౌడ్ తెలిపారు. స్థానిక శ్రీషిర్డిసాయి రెయిన్‌బో పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీలకు మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక నాయకులు ప్రభాకర్‌నాయుడు, రెడ్డయ్యనాయుడు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హీ సేవను కొనసాగించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ నాగేశ్వరరావు

**రాజంపేట:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 15 రోజుల పాటు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించిందని.. ఇకపై కూడా విద్యార్థులు, ప్రజలు కొనసాగించాలని పురపాలక కమిషనర్ బి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. శానిటేషన్ అధికారి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

## ఆక్రమణలపై చర్యలకు డిమాండు

**రాజంపేట గ్రామీణ:** తాళ్లపాక గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు, పంట కాలువలు ఆక్రమణలకు గురయ్యాయని రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని తెదేపా నేతలు డిమాండు చేశారు. తాళ్లపాక గ్రామస్థులతో తెదేపా నేతలు కలిసి ఆక్రమిత భూములను పరిశీలించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. తెదేపా నేతలు సుబ్బనరసయ్యనాయుడు, జయసింహ, రమణ, పెంచలయ్య పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**వీరబల్లి, న్యూస్‌టుడే:** మండల పరిధిలో నీలావాండ్లపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిచ్చికుంటపల్లికి చెందిన రాఘవులు(56)కు తీవ్రగాయాలైనట్లు ఎస్సై మోహన్‌నాయక్ తెలిపారు. రాయచోటిలోని ఆదర్శ పాఠశాలలో చదివే ముగ్గురు విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వస్తుండగా నీలావాండ్లపల్లి వద్దకు వెళ్లగానే రాయచోటి నుంచి ఆటోలో దిగి పిచ్చికుంటపల్లి స్వగ్రామానికి వెళుతున్న రాఘవులును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనంలో ఉన్న ఒక్కరికి స్వల్పగాయాలయ్యాయన్నారు. రాఘవులను చికిత్స నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### సచివాలయ మహిళా పోలీసుకు...

**సుండుపల్లి:** పొలిమేరపల్లి గ్రామ సచివాలయ మహిళా పోలీసు అందెల వరలక్ష్మి రహదారి ప్రమాదంలో గాయపడ్డారు. గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేసేందుకు మంగళవారం ద్విచక్ర వాహనంలో వెళ్తూ అదుపుతప్పి కింద పడి గాయపడ్డారు. స్థానికులు రాయచోటి ఆసుపత్రికి తరలించారు.

## శ్మశాన స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

**సుండుపల్లి, న్యూస్‌టుడే:** సుండుపల్లి దిగువ గుల్లావాండ్లపల్లి తూర్పుభాగంలో వంక పక్కన తాము శ్మశానానికి వినియోగించుకుంటున్న భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని స్థానికులు మంగళవారం తహసీల్దారు కార్యాలయం, పోలీసు స్టేషన్లో వినతి పత్రాలు ఇచ్చారు. 50 ఏళ్లుగా శ్మశానానికి వినియోగించుకుంటున్న స్థలాన్ని రక్షించాలని కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

# ఉద్యానం... పండగొస్తేనే లాభం

• నిలకడ లేని ధరలతో ఇబ్బందులు • ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** కర్షకుల జీవితాలు పండగల ఆధారంగానే గట్టెక్కుతున్నాయి. రైతులు ఏ పంట పెట్టాలన్నా.. ఆ తరువాత వచ్చే పండగలు, పర్వదినాలను లెక్క చూసుకుని ప్రారంభించాల్సి వస్తోంది. ఏ పంటా ఒక్కసారిగా పూర్తిగా చేతికందదు. పండగ సమయానికి వచ్చిన దిగుబడికి మాత్రమే మంచి ధర లభిస్తోంది. వీటిల్లో దళారుల పాత్ర వేరేగా చెప్పనవసరం లేదు. ప్రస్తుతం బొప్పాయి అనంతపురం, మదనపల్లె, తమిళనాడు ప్రాంతాల్లో టన్ను రూ.25 వేలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. కానీ.. కోడూరు, రాజంపేట ప్రాంతాలలో ఆ ధర రూ.10 వేలకు మించడం లేదు. మిగతా లాభమంతా దళారుల పాలవుతోందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులు వ్యవసాయంపై ప్రభావాన్ని చూపుతున్నాయి.

● ఉర్లగట్టుపోడు గ్రామానికి చెందిన అంకయ్య అనే రైతు తనకున్న రెండెకరాల పొలంలో ఈ ఏడాది సుగంధాల రకం అరటి సాగు చేశారు. నెల రోజుల కిందటి వరకు టన్ను రూ.20 వేలు పలుకుతుండడంతో అప్పుడప్పుడే దిగుబడి వస్తున్న తోటకు మంచి ఎరువులు, మందులు అందించారు. ఎంత చేసినా కాయలు ముదిరితేనే వ్యాపారులు కొంటారు. ఆ ప్రక్రియలో పది రోజులు ఆలస్యం జరిగింది. వినాయక చవితి పండుగకు రావాల్సిన దిగుబడి వారం రోజులు ఆలస్యమైంది. దీంతో ధర రూ.12 వేలకు పడిపోయింది. మహాలయ అమావాస్య పక్షం రోజుల పాటు వ్యాపారులు ధరలు తగ్గించేశారు.

● రెడ్డివారిపల్లెకు చెందిన రమేష్‌కు పునాస రకం మామిడి తోట ఉంది. ఈ రకం చెట్లు అన్ సీజన్‌లో కాపునిస్తాయి. కేరళలో జరిగే ఓనం పండగ ఆధారంగా ఈ రకం కాయలు ధరలను సంతరించుకుంటాయి. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా పునాస చెట్లు పూతలు, కాయలతో నిండుగా ఉంటాయి. ఆ పండగ సమయంలో టన్ను మామిడి కాయలు రూ.50 వేలు పలికాయి. ఆయన నాలుగెకరాల తోట నుంచి రెండు టన్నులు మాత్రమే దిగుబడి తీయగలిగారు. పండగ దాటగానే వ్యాపారులు టన్ను రూ.30 వేలకు దించేశారు. ఇలా పండగలు ఉద్యాన దిగుబడులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. పరుగు పందెంలా రైతు సరిగ్గా నిర్ణీత వ్యవధిలో లక్ష్యాన్ని చేరుకోకపోతే ఓడిపోక తప్పని పరిస్థితి ఎదురవుతోంది. ఈ పరిస్థితులపై ఉద్యాన శాఖ అధికారులను అడిగినా డిమాండ్ - సప్లయ్ ఆధారంగా ధరలు ఉంటాయని చెప్పడం మినహా ఏ చర్యలు చేపట్టలేకపోతున్నారు.


బొప్పాయి పంటను చూపుతున్న రైతు


ప్రస్తుతం టన్ను రూ.12 వేల నుంచి రూ.13 వేలు పలుకుతున్న సుగంధాల రకం అరటి

### ప్రభుత్వం చేయూతనివ్వాలి



నాలుగు రోజులు మంచి ధర లభించగానే మార్కెట్ డౌన్ పడిపోయింది అంటారు. ఏమని అడిగితే వినాయకచవితి వెళ్లిపోయింది. మాలాయలు వచ్చాయి కదా అంటున్నారు. దసరా.. దీపావళి వెళ్లిపోతేనే ధరలు అంటూ కారణాలు చెబుతున్నారు. రూ.20 వేలు పలికిన అరటి వారం రోజుల్లోనే రూ.12 వేలకు పడిపోతే రైతు పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. జూదంలా మారిన వ్యవసాయానికి ప్రభుత్వాలు చేయూతనివ్వాలి. ధరలు నిలకడగా ఉంటే మాకు మేలు.
**- విజయభాస్కర్‌రెడ్డి, రైతు, ఉర్లగట్టుపోడు**

### కచ్చితమైన ధరలు ఉండాలి



ప్రతి పంటకు రైతులకు గిట్టుబాటయ్యేలా ప్రభుత్వం నిర్ణీత, నిర్దిష్టమైన ధరలు ప్రతిపాదిస్తేనే వ్యవసాయం గట్టెక్కుతుంది. ఈ ధరల పరిస్థితి, మార్కెటింగ్, దళారుల దోపిడీలను భరించలేక అనేక మంది వ్యవసాయానికి దూరమవుతున్నారు. బొప్పాయి సాగు చేస్తే నష్టాలు తప్పవన్న భావన కలిగిస్తున్నారు. అరటి, మామిడి పంటలకూ అదే పరిస్థితి. ఓ వైపు ఎరువులు, పురుగుమందులతో పాటు కూలీల ధరలుకూడా విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పండగలు, పబ్బాలంటూ రైతులను దోచేస్తున్నారు.
**- వెంకటయ్య, రైతు, అయ్యవారిపల్లె**

## విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయాలి


రిలే దీక్షలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

**రాయచోటి, న్యూస్‌టుడే:** విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ మంగళవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేశారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలన్నారు. 32 మంది విద్యార్థుల త్యాగాలు, ఎంతో మంది వామపక్ష ఎమ్మెల్యేల రాజీనామాలు, రైతుల త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ప్రేమాలయ ఆశ్రమం సందర్శన


వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి

**రామాపురం, న్యూస్‌టుడే:** బండపల్లె పంచాయతీలో ఉన్న ప్రేమాలయ వృద్ధాశ్రమాన్ని మంగళవారం లక్కిరెడ్డిపల్లె జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఫైజున్నీషా అన్నారు. వృద్ధాప్య ఆశ్రమాన్ని మంగళవారం సందర్శించారు. వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను ప్రేమానురాగాలతో చూసుకోవాలని సూచించారు.

## రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

**చిన్నమండెం, న్యూస్‌టుడే:** చిన్నమండెంతో పాటు పలు గ్రామాల్లో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నమండెంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం, దేవగుడిపల్లెలోని కాళీ మాత మందిరం, తొగటపల్లెలోని చౌడేశ్వరీ ఆలయాల్లో ఉత్సవాల ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. తొగటపల్లెలో విజయదశమి రోజున అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

## రెవెన్యూ అధికారుల విచారణ

**చిన్నమండెం, న్యూస్‌టుడే:** కొత్తపల్లెలోని ఆర్అండ్ఆర్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారని గ్రామస్థుల ఫిర్యాదుతో మంగళవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దారు నరసింహులు ఆదేశాల మేరకు.. ఆర్ఐ, వీఆర్వోలు, సర్వేయర్లు కలిసి కాలనీకి కేటాయించిన స్థలం, ప్లాట్లపై సర్వే చేశారు. అక్రమ కట్టడాలను ఆపాలని ఆదేశించారు.

## మహిళలకు స్వయం ఉపాధిపై ఉచిత శిక్షణ

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని గ్లోబల్ సర్వీసు ట్రస్టు కార్యాలయంలో మహిళలకు మగ్గం వర్క్‌పై 30 రోజులు, జ్యూట్ బ్యాగ్‌ల తయారీపై 15 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు మధ్యాహ్నం భోజన వసతులు కల్పిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు పార్థసారథి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కడపకు చెందిన కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు తమ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## గ్రామసభను విజయవంతం చేయాలి

**లక్కిరెడ్డిపల్లె:** లక్కిరెడ్డిపల్లెలో గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక గ్రామసభను విజయవంతం చేయాలని డీఎల్పీవో పార్వతి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. ఈ సభకు రవాణా, క్రీడల, యువజన శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్, డీపీవో ధనలక్ష్మి హాజరవుతారన్నారు. ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి, ఈవోపీఆర్డీ పట్నాయక్ పాల్గొన్నారు.

## హెల్త్ అసిస్టెంట్లను క్రమబద్ధీకరించాలని వినతి


మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

**రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే:** వైద్య ఆరోగ్య శాఖలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను క్రమబద్ధీకరించాలంటూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను సోమవారం సాయంత్రం కడపలో కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు పారామెడికల్ ఒప్పంద ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బోగస్ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశామన్నారు. జేఏసీ నాయకులు రామయ్య, చాంద్‌బాషా, నరసయ్య, శివరామయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి


విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జేవీవీ నాయకులు

**రాయచోటి, న్యూస్‌టుడే:** విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డైట్ కేంద్రంలో మంగళవారం చెకుముకి పోటీలు నిర్వహించారు. భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి మంచి సేవలు అందించాలన్నారు. జన విజ్ఞాన వేదిక వారు నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థులకు ఎంతగానో తోడ్పతాయన్నారు. జిల్లాలోని 22 పాఠశాలలకు చెందిన 84 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారని జేవీవీ మండల శాఖ అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. కంటి వైద్యుడు రెడ్డెన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతిపిత యువతకు ఆదర్శం


జాతిపిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

**పుల్లంపేట, న్యూస్‌టుడే:** యువతకు జాతిపితే ఆదర్శం కావాలని కొత్తపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున తెలిపారు. కొత్తపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందుస్తుగా మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీ పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న విద్యార్థులు, హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

**రాజంపేట గ్రామీణ:** పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ రమణ తెలిపారు. ఎన్టీఆర్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. వాటిని సంరక్షించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నరసింహులు, పాఠశాల ఛైర్మన్ దుర్గా పాల్గొన్నారు.

## పాఠశాల గదికి తాళం వేసి వెళ్లిపోయిన ఉపాధ్యాయుడు

● విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారనే అక్కసుతోనే

**గాలివీడు, న్యూస్‌టుడే:** తమ విద్యార్థులకు సక్రమంగా పాఠాలు చెప్పట్లేదని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారనే కారణంతో పాఠశాల గదికి ఉపాధ్యాయుడు తాళం వేసి వెళ్లిపోయిన సంఘటన గాండ్లపల్లెలో మంగళవారం చోటు చేసుకుంది. ఎంఈవో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తరచూ విధులకు గైర్హాజరవుతూ తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పట్లేదని తల్లిదండ్రులు సోమవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో తాఖీదులు ఇవ్వాలని సీఆర్పీని గ్రామానికి పంపించగా స్థానికులతో వాదోపవాదాలకు దిగిన ఉపాధ్యాయుడు పాఠశాల గదికి తాళం వేసి వెళ్లిపోయారన్నారు. ఈ విషయమై డీఈవో శివప్రకాష్‌రెడ్డికి నివేదించినట్లు ఎంఈవో వివరించారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**రాజంపేట, న్యూస్‌టుడే:** మహాత్మాగాంధీ జీవిత విషయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఏఐటీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. స్థానిక ఏఐటీఎస్ యూనివర్సిటీలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని టచ్‌స్టోన్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మహాత్ముడి జీవన విధానం, గొప్ప ఆలోచనలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలు వెంకటదీప్తి, ముధువాణి, సాజియాలకు ప్రోత్సాహకాలు అందించారు. టచ్‌స్టోన్ విభాగం కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎంపీడీవో మల్లీశ్వరి

**వీరబల్లి, న్యూస్‌టుడే:** కష్టపడి, ఇష్టపడి చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీవో మల్లీశ్వరి అన్నారు. వీరబల్లి ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్టులో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఏటా జరిగే చెకుముకి టాలెంట్ టెస్టులో తప్పక పాల్గొనాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరబల్లి, పేరయ్యగారిపల్లి, చమర్తివాండ్లపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎంపీడీవో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా అసోసియేట్ సైన్స్ ఆఫీసర్ పల్లం రామచంద్ర, ఇన్‌ఛార్జి హెచ్ఎం రెడ్డెయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముందస్తు దసరా వేడుకలు


అమ్మవార్ల వేషధారణలో చిన్నారులు, పక్కన ఎంఈవో రఘునాథ్‌రాజు తదితరులు

**రాజంపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని చెర్రీస్ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. దసరా విశిష్టతను ఎంఈవో రఘునాథ్‌రాజు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వేశధారణల్లో అలరించారు. కరస్పాండెంట్ ప్రేమలత, వెంకటేశ్వరరెడ్డి, సీఏవో రంగప్రసాద్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థుల సత్తా


వీరబల్లి : రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎంపీడీవో మల్లీశ్వరి, ఉపాధ్యాయులు

**వీరబల్లి, న్యూస్‌టుడే:** రాయచోటి మాసాపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి వీరబల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి హెచ్ఎం రెడ్డెయ్య, పీడీ వేణుమాధవరాజు తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలుర విభాగంలో భరత్, నాసర్, అండర్-17 బాలికల విభాగంలో సాఫ్ట్‌బాల్‌లో కావ్య, అండర్-17 బేస్‌బాల్ బాలుర విభాగంలో నాసర్, అండర్-14 విభాగంలో సాఫ్ట్‌బాల్‌లో వేణుగోపాల్, అండర్-14 బాలికల విభాగంలో సాత్విక్, అండర్-14 బాలికల విభాగం బేస్‌బాల్‌లో సాత్విక్ ఎంపికయ్యారు. వీరిని మంగళవారం జడ్పీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మల్లీశ్వరి, ఇన్‌ఛార్జి హెచ్ఎం రెడ్డెయ్య, వీఆర్‌డీఎస్ ఛైర్మన్ సురేంద్రారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

### కబడ్డీ పోటీల్లో ఉప్పరపల్లి విద్యార్థిని...



స్థానిక అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో **ఎం.రెడ్డి కావ్య** ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్.ఎం చంద్రశేఖర్, పీడీ శేఖర్ తెలిపారు.

### సాఫ్ట్‌బాల్ బేస్‌బాల్ పోటీలకు...

**సుండుపల్లి:** సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడలలో పాల్గొనే ఉమ్మడి కడప జిల్లా జట్టుకు సుండుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ రవీంద్రనాథ్‌రాజు తెలిపారు. మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎంపికలో 14 ఏళ్లలోపు సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎస్.అభి, జి.కిరణ్‌కుమార్, పి.జేష్ఠ, బేస్‌బాల్ జట్టుకు జి.కిరణ్‌కుమార్, జి.వంశీ, ఎం.సంధ్యలు ఎంపికయ్యారు. తెలిపారు. 17 ఏళ్ల లోపు విభాగం సాఫ్ట్‌బాల్ జట్టుకు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బేబీ, బేస్‌బాల్ జట్టుకు ఉదయ్‌కిరణ్, భరత్‌కుమార్, బేబిలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం జయన్నలు పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి క్రీడా పోటీలకు...

**పుల్లంపేట:** రైల్వేకోడూరు జరిగిన నియోజకవర్గ స్థాయి చదరంగం, షటిల్, యోగా పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు టి.కమ్మపల్లె ప్రధానోపాధ్యాయిని బబిత, వ్యాయామ ఉపాధ్యాయిని ప్రమీల పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి క్రీడాకారులను అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సుండుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు


పుల్లంపేట : ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్ రాక
04.10.2024వ తేదీన "C.N.R. డయాగ్నస్టిక్ సెంటర్" రాజంపేట నందు,
05, 06.10.2024 వ తేదీన కడప "బొల్లినేని డయాగ్నస్టిక్ సెంటర్" నందు
డా॥ సి.యస్. శ్రీనివాసరాజు, M.D., D.M., గుండె వ్యాధుల సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్
బీపీ, గుండెదడ, చెమటపట్టడము, ఏంజియోగ్రామ్, ఏంజియోప్లాస్టి, స్టంట్లు వేయబడును.
C.N.R. డయాగ్నస్టిక్ సెంటర్ మెయిన్ రోడ్, ఆర్అండ్‌బి బంగ్లా ఎదురుగా, రాజంపేట 08565-251424. Cell : 9959681295
బొల్లినేని డయాగ్నస్టిక్ సెంటర్ పాలెం పాపయ్య వీధి, కడప, 08562-273698, Cell : 9848120449.


చతుర్థ వర్ధంతి
చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ మా అందరికీ ప్రేమానురాగాలు పంచి మా ఉన్నతికి అహర్నిశలు కృషి చేసి మా అందరి హృదయాలలో సుస్థిర స్థానం పొంది మా నుండి దూరమై నేటికి 4 సంవత్సరములు గడిచినా మీ తీయని జ్ఞాపకాలు ఎన్నటికీ మరువలేము. మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని కోరుకుంటూ...
కీ॥శే॥ దారపునేని రాజా నాయుడు
ప్రముఖ పారిశ్రామికవేత్త, బద్వేలు.
S/o కీ॥శే॥ దారపునేని జయరామనాయుడు
(IOC డీలర్)
శ్రీ స్వర్ణ సాయి ఫిల్లింగ్ స్టేషన్, శ్రీ రాజా బజాజ్.
జననం : 25-12-1979 మరణం : 02-10-2020
భార్య : శ్రీమతి నాగమణి
కుమార్తె : దారపునేని రితిక
కుమారుడు : దారపునేని రామ్‌స్వరూప్
అక్క, చెల్లెలు బావగార్లు
రాధిక పుల్లయ్యనాయుడు
సంగీత సుబ్బారావు
పెదనాన్న : దారపునేని శ్రీరాములు నాయుడు
చిన్నాన్న : దారపునేని దశరథరామా నాయుడు
అన్నలు, తమ్ముళ్లు : దారపునేని రామక్రిష్ణ, దారపునేని రాజేష్ నాయుడు, దారపునేని రాఘవేంద్ర, దారపునేని గిరిసాయి
కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు